క్లుప్తంగా

'రాజీవ్ యువవికాసం' దరఖాస్తు గడువు పొడిగింపు

చండూరు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఏప్రిల్ 14వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ బండారు యాదగిరి మంగళవారం తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువత సమాజసేవలో ముందుండాలి



చలివేంద్రాన్ని ప్రారంభించిన డీసీసీబీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు : నేటి యువత సమాజసేవలో ముందుండాలని నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ మండల నాయకుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో అశ్వసేన యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసినా చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ చైర్మన్ దొటి నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, పోలగొని సత్యంగౌడ్, నాయకులు జిట్టగొని యాదగిరి, దుబ్బ రవి, మాదగోని రాజేష్, మిర్యాల వెంకన్న, సాగర్ల లింగస్వామి, పాలకూరి యాదయ్యగౌడ్, పందుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరేణుకఎల్లమ్మ అమ్మవారి మొక్కుబడి కల్యాణం



శ్రీరేణుక ఎల్లమ్మ అమ్మవారు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుక ఎల్లమ్మఅమ్మవారి ఆలయం వద్ద భక్తులు, ఆలయ అర్చకుడు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో మంగళవారం మొక్కుబడి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తెల్లవారుజామున సహస్ర నామాలతో విశేష పూజలు జరిపి అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపించి, చీర, సారే ఒడిబియ్యం, బొనాలు సమర్పించారు.

ప్రతి కార్మికుడికి 25కిలోల సన్నబియ్యం ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : ప్రతి వ్యవసాయ కార్మికుడికి 25కిలోల సన్నబియ్యం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేదలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. అవి సరిపోవని, వ్యక్తికి 25కిలోలు ఇస్తే బాగుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి కార్మికులకు రెండు నెలల పెండింగ్ బిల్లులు ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్నవెంకులు, దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, ఉడుగుండ్ల రాములు, ఆర్.రవినాయక్, లూర్దు మారయ్య, సుకన్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్రిగూడ : కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరుపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు మండల కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మేతరి యాదయ్య, పాశం సురేందర్‌రెడ్డి, మాతంగి నవీన్, వెంకటంపేట బాలయ్య, మాస చంద్రశేఖర్, ఎలిమినేటి సత్తిరెడ్డి, జంగిలి రవి, లూర్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో.?

- కొనసాగుతున్న వరికోతలు
- కేంద్రాలు ప్రారంభంకాక ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

శాలిగౌరారం : మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్ వరికోతలు ఇప్పటికే ముమ్మరంగా జరుగుతున్నాయి. కానీ నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో వరికోతలు చేపట్టిన రైతులు తమ ధాన్యాన్ని మిల్లర్లకు, దళారులకు అమ్ముకుంటుండగా మరికొంతమంది ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. దీంతో ఇప్పటికే ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాసులతో నిండిపోయాయి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటల సాగు కొంత ముందుగానే ప్రారంభంకావడం, అందులోనూ స్వల్పకాలిక రకాల వరిపంట సాగు జరగడంతో వరికోతలు కూడా ముందుగానే ప్రారంభమయ్యాయి.

మండలంలో 15కొనుగోలు కేంద్రాలు..

మండలం నుంచి ప్రస్తుత యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 15 కేంద్రాలను మంజూరు చేసింది. వాటిలో ఐకేపీ-7, పీఏసీఎస్-5, ఎఫ్‌పీఓ-2, ఎన్‌డీసీఎంఎస్-1 ఉన్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో ఎస్‌జి కొత్తపల్లి, రామాంజాపురం, గురుజాల, భైరవునిబండ, చిత్తలూరు, ఆకారం, తుడిమిడి, పీఏసిఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో శాలిగౌరారం, తిరుమలరాయుని



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిల్వ ఉన్న ధాన్యం రాసులు

గూడెం, అడ్లూరు, ఊట్కూరు, మాధారంకలాన్, రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో పెర్క కొండారం, రామగిరి, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఇటుకులపహాడ్‌లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు.

మిల్లుల కేటాయింపులో జాప్యం..

ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరు జరిగినా ఆయా కేంద్రాలకు గన్నీసంచులు, కాంటాలు, రవాణాకు సంబంధించి లారీల ఏర్పాటుతో పాటూ అన్నింటిని మించి మిల్‌ట్యాగింగ్(ధాన్యం దిగుమతులకు మిల్లుల కెటాయింపు) ప్రక్రియ జరగాల్సి ఉంది. ఇవన్నీ జరిగితేనే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుంది. కానీ అవేమి జరగకుండా కేంద్రాలు ప్రారంభమానికే పరిమితం కానున్నాయి. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అన్ని రకాల అనుమతులను వేగవంతం చేసి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కేంద్రాలు త్వరితగతిన ప్రారంభించాలి



సాగుచేసిన వరిపంట మొత్తం కోతకోశాం. వచ్చిన పంట దిగుబడులను స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తరలించాం. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు జరుగుతుందని కేంద్రం ఏర్పాటు చేసే ప్రదేశంలో ధాన్యం ఆరబోసి నిల్వలు చేశాం. అకాల వర్షాల వచ్చే సూచనలు కనిపిస్తుండడంతో భయంగా ఉంది. అకాల వర్షం పడితే ఆరబోసిన ధాన్యం తడిసి దెబ్బతింటుంది. ప్రభుత్వం త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– తోటకూరి బాబు, రైతు, శాలిగౌరారం

కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం



ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అందుకు సంబంధించిన ప్రక్రియను ఇప్పటికే మొదలుపెట్టాం. సిబ్బందిని ఎక్కువ మొత్తంలో వినియోగించుకొని కేంద్రాలు ప్రారంభం కాగానే ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తిచేసేలా కార్యాచరణ తయారు చేసుకుంటున్నాం. రైతులు ఇబ్బందులు పడకుండా చూడడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం.

– నిమ్మల ఆంజనేయులు, పీఏసీఎస్ సీఈఓ, శాలిగౌరారం

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం

- ప్రముఖ పండితుడు కేవీ శర్మ

నార్కట్‌పల్లి : కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ మహిళలు ముందుతరాలకు ఆదర్శంగా నిలవాలని ప్రముఖ పండితుడు కేవీ శర్మ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలో శ్రీనారీ శక్తి నార్కట్‌పల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది ఉత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు విశ్వావసు నూతన సంవత్సర పంచాంగాన్ని చదివి వినిపించారు.



ఉగాది ఉత్సవాలలో మాట్లాడుతున్న కేవీ శర్మ

అనంతరం మహిళలు ఇంటి వద్ద పూజలు నిర్వహించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నారీశక్తి సభ్యులు తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

చిట్యాల : మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన పలువురు ఇటీవల మృతి చెందడంతో లారీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మృతుల కుటుంబాలకు వేర్వేరుగా ఆర్థికసాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన గుమ్మి చరణ్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి ఆ గ్రామానికి చెందిన విఘ్నేశ్వర లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.83,600 ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా కూరాకుల ధనుంజయ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబానికి గ్రామానికి చెందిన ఏపూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.75వేలు అందజేశారు. కార్యక్రమాలలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపల్ల మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పాలెం శంకరయ్య, అంజయ్య, అయితగోని స్వామి, అంతటి నరేష్, ఎంపల్ల వెంకట్‌రెడ్డి, బొంగు వెంకటేశం, సామ లింగారెడ్డి, పంతంగి లింగస్వామి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

చండూరు : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను ఆశల్లో ముంచెత్తి మోసం చేసిందని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని గుంద్రపల్లి గ్రామంలో 6 గ్యారంటీల లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల సేకరణ కార్యక్రమం 6రోజులకు చేరింది. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు, అసెంబ్లీ కోకన్వీనర్ కాసాల జనార్దన్‌రెడ్డి, మురళీమనోహర్‌రెడ్డి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సేవతో సమగ్ర వ్యక్తిత్వ వికాసం అలవడుతుంది

నకిరేకల్ : జాతీయ సేవా పథకంలో పనిచేసి సేవలందించిన వలంటీర్లకు సమగ్ర వ్యక్తిత్వ వికాసం అలవడుతుందని నల్లగొండ ఎంజీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి అన్నారు. మంగళవారం మండలంలోని ఓగోడు గ్రామంలో నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెండో రోజు ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో పలు చోట్ల శ్రమదాన కార్యక్రమాలను నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం అధికారి నర్సింహ, కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసాచారి, శంకర్, శ్రీను, సతీష్, శివశంకర్, నర్సింహచారి పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

చండూరు : పట్టణంలోని డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా మంగళవారం ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. గత మార్చి 27నుంచి కస్తాల గ్రామంలో 50 మంది వలంటీర్లు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఘణ శ్యామ్, పీఓ డాక్టర్ పి.శ్రీనివాస్, అధ్యాపకులు, గ్రామస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.



నకిరేకల్ : వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కోఆర్డినేటర్ మద్దిలేటి

ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

నకిరేకల్ : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఉభయవేదాంత ప్రవర్తక చార్యులు సామీరి పీఠాధిపత్యులు శ్రీఆర్‌కే వేదాంతం అన్నారు. మంగళవారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9వరకు నిర్వహించే బోయే సంపూర్ణ శ్రీరామాయణప్రవచన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన భక్తులకు తమ ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుండా వెంకటయ్య, అన్నమయ్య కళా సమితి ప్రతినిధి గాయని గండేపల్లి సుమలత, అరుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.



రామాయణ ప్రవచనాలు వినిపిస్తున్న పీఠాధిపతులు వేదాంతం

పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

- ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : రాష్ట్రంలో పేదప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో రేషన్‌కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదప్రజలు ఆకలితో అలమటించకుండా సన్నబియ్యం అందించాలనే ఆలోచనలతో ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ పథకం అమలులో లేదని, ఈ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో 28 రేషన్ దుకాణాల ద్వారా మొత్తం13916 రేషన్ కార్డులకు 2638.62 క్వింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, తహసీల్దారు శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి పొడిచెట్టి వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు బొంగు కృష్ణ, చింతనూరి శ్రీరంగం, మద్ది మహేశ్, వెంకన్న, రవి, శ్రీధర్ రేషన్‌డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మునుగోడు : నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ కృషి చేస్తుందని నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా తెల్లరేషన్‌కార్డులకు అందిస్తున్న సన్న బియ్యాన్ని మంగళవారం మండలంలోని ఊకొండి గ్రామంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాని పేద ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ చైర్మన్ దొటి నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఆర్ఐ నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, మాజీ ఎంపీపీ పోలగొని సత్యం, నాయకులు నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, బూడిద లింగయ్యయాదవ్, సాగర్ల లింగస్వామి, యాదగిరి, మేడి యాదయ్య, స్వామి పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్‌దుకాణం -18లో రేషన్ బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. మండల వ్యాప్తంగా 24రేషన్ దుకాణాలకు గాను 9,365 రేషన్‌కార్డులు ఉండగా 1907.94 క్వింటాళ్ల సన్న బియ్యం అన్ని దుకాణాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్ రావు, మాజీ ఎంపీపీ లపంగి వజ్రమ్మ, మాజీ జెడ్పీటీసీలు మేతరి యాదయ్య, పాశం సురేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, జమ్ముల వెంకటేష్, పగడాల లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం : చిత్తలూరులో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



మునుగోడు : సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



మర్రిగూడ : యరగండ్లపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నక్క శ్రీనివాస్‌యాదవ్

ప్రజా పోరాటాలపై పోలీసుల నిర్బంధాలు ఆపాలి

నల్లగొండ టౌన్ : రాష్ట్రంలో ప్రజా కార్మిక పోరాటాలపై పోలీసుల నిర్బంధాలను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూములు అమ్మాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయమన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతు తెలుపుతున్న సీపీఎం అనుబంధ సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పుచ్చకాయల నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, కొండా వెంకన్న, బొల్లు రవీందర్, ఊట్కూరి మధుసూదన్‌రెడ్డి, సైదాచారి, సత్యనారాయణచారి, యాదగిరి, మహేష్, ఆకారం మహేష్, కంభంపాటి శంకర్ తదితరులు ఉన్నారు.

హెచ్‌సీయూ భూములు రక్షించాలని ఆందోళన

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూమిని రక్షించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూకు చెందిన భూమిని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా లాక్కుంటుందని ఆరోపిస్తూ మంగళవారం బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంజీ యూనివర్సిటీ ఎదుట నిరసన తెలిపారు. భూమి రక్షణకోసం పోరాటం చేస్తున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు అంబటి ప్రణీత్, జాన్‌స్రేం, పాక రవి, మాచర్ల సుధీర్, వాడపల్లి నవీన్, రవి, తరుణ్, కోటి, ముఖేష్ పాల్గొన్నారు.

చిట్యాల : హెచ్‌సీయూకు చెందిన నాలుగు వందల ఎకరాల భూముల వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకుండా ఉండేందుకుగాను మంగళవారం మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్‌తో పాటు పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు గోలి సాయికిరణ్, కురాలకు బాలు, అంతటి ఆది ప్రకాష్, శ్రీకాంత్, అర్రూరీ పవన్ ఉన్నారు.

సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల అరెస్ట్

చండూరు : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల అమ్మకంపై కొనసాగుతున్న ఆందోళనలో పాల్గొనేందుకు వెళ్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులను స్థానిక పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు మాదగోని అరుణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీపీఎం నాయకుల అరెస్ట్

గట్టుప్పల్ : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400ఎకరాల భూమిని ప్రభుత్వం వేలం వేసే ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం చేపట్టిన చలో యూనివర్సిటీకి వెళ్లకుండ మంగళవారం స్థానిక పోలీసులు నాయకులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ పట్టణ కార్యదర్శులు పెద్దగాని నర్సింహ, కర్నాటి వెంకటేశం, సీఐటీయూ నాయకులు నగేష్, యాదిరెడ్డి తదితరులు ఉన్నారు.

తిప్పర్తి : హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ ఎదుట ధర్నా నిర్వహించడానికి వెళ్తున్న సీఐటీయూ నాయకులను మంగళవారం మండల పోలీస్ ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు బీమగాని గణేష్, పోకల శ్రీధర్ ఉన్నారు.

కేతేపల్లి : హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల సందర్శనకు వెళ్తున్న సీపీఎం మండల నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టయిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్ధుమారయ్య, నాయకులు వంగూరి వెంకన్న తదితరులు ఉన్నారు.

కట్టంగూర్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన 400ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టిన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముసుకు రవీందర్ అన్నారు. యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం యూనివర్సిటీ ఎదుట జరిగే ధర్నా వెళ్లకుండా సీపీఎం నాయకులను మండల పోలీసు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో కేవీపీఎస్ మండల నాయకుడు పాదూటి నరహరి, ఎల్లయ్య, రమేష్ ఉన్నారు.

మర్రిగూడ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని యూనివర్సిటీలో మంగళవారం నిర్వహిస్తున్న ధర్నాకు తరలివెళ్లకుండా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీపీఐ మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వారిలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కొర్రెడ్డి గిరి ఉన్నారు.

నకిరేకల్ : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్మకానికి పెట్టిన ప్రయత్నాలను విరమించాలని చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి వెళ్తున్న సీపీఎం నాయకులను మంగళవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు వంటి పాక వెంకటేశ్వర్లు, రాచకొండ వెంకట్‌గౌడ్, గణేష్, నర్సింహ, తాజేశ్వర్, కృష్ణ, జమదగ్ని ఉన్నారు.



నల్లగొండ టూ టౌన్ : ఎంజీయూ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు



చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

చంద్రశేఖర్ మృతి తీరనిలోటు

నల్లగొండ టౌన్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ నాయకుడు రాచకొండ చంద్రశేఖర్ మృతి తీరనిలోటని రాష్ట్ర అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఫెడరేషన్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ కుటుంబానికి రూ.2లక్షల 20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడిదె వెంకటేశ్వర్లు, రాష్ట్ర కోశాధికారి సీహెచ్.బాలస్వామి, కంబంపాటి నర్సింహ, రవిశంకర్, తోట శ్రవణ్, హనుమంతు, స్వామి, నాగయ్య, జాని, పరమేష్, గోలి వెంకన్న, పసుపులేటి లక్ష్మయ్య, మిట్ట కృష్ణారెడ్డి, వడ్డె దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

రాచకాల్వకు గండ్లుపెడితే సహించేది లేదు

శాలిగౌరారం : మూసీనది నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరే రాచకాల్వకు అక్రమంగా గండ్లుపెట్టి నీటిని చేపల చెరువుల్లోకి దారి మళ్లించి నీటి చౌర్యానికి పాల్పడితే సహించేదిలేదని నీటిపారుదలశాఖ డీఈఈ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన ఫోన్‌లో సాక్షి తో మాట్లాడారు. శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వెళ్లేందుకు మూసీనదిపై రామన్నపేట మండలం పల్లివాడ వద్ద నిర్మితమై ఉన్న హెడ్‌రెగ్యులేటర్ నుంచి 25కిలోమీటర్ల పొడవు ఉన్న రాచకాల్వకు ఇటీవల వరదనీటిని మళ్లించినట్లు, మూసీనదిపై పల్లివాడ వద్ద నిర్మించిన ఆనకట్టకు ఉన్న ఎస్కేప్ తూములకు షట్టర్లు ధ్వంసం కావడంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చిచేరడం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆనకట్ట ఎస్కేప్ తూములకు నూతన షట్టర్లు బిగించామన్నారు. దీంతో రాచకాల్వలో వరదనీరు ప్రవహిస్తుందన్నారు. రాచకాల్వలో ప్రవహించే నీటిని గండ్లుపెట్టి వృథా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త సమాచారం

బీసీలకు మంత్రి పదవి ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 42శాతం చోటు కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో సింగం శ్రీకాంత్ యాదవ్, మహ్మద్ నజీర్, చెన్నోజు రాజు, సంగం జగదీశ్వర్, దీకొండ నవీన్‌కుమార్, మార్గం సతీష్‌కుమార్, జితేందర్, ప్రభాకర్, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా భోగ్‌బండార్

మర్రిగూడ : మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిబండతండాలో మంగళవారం గిరిజనుల ఆరాధ్య దైవమైన మరమ్మ యాడి శ్రీశ్రీసంత్‌సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార్ కార్యక్రమాన్ని గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆంబోతునాయక్, లక్ష్మణ్, పాండు, శ్రీను, శ్రీను, సుధాకర్, రమేష్, పద్మ ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర పొందాలి

తిప్పర్తి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి బి.సన్నిరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంఆయన సందర్శించి ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. వెంట ఏఈఓ సంతోషి, రైతులు ఉన్నారు.

యూనియన్ కమిటీ ఎన్నిక

మునుగోడు : మండల కేంద్రంలో మంగళవారం సెంట్రింగ్ యూనియన్ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడిగా తోటకూరి మారేష్, ఉపాధ్యక్షుడిగా ఇరిగి లింగం, కార్యదర్శిగా యంపల్ల నరేష్, ప్రధాన కార్యదర్శిగా జిల్లా సాగర్, కోశాధికారిగా అందుల లింగస్వామి, సలహాదారుగా మలేష్, సహాయ కార్యదర్శిగా వెంకన్న, గౌరవ సలహాదారులుగా నగేష్, అంజయ్య, శంకర్, సతీష్ ఎన్నికయ్యారు.

• నిరుపయోగంగా జనరేటర్

కేతేపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలు, ఆన్‌లైన్ పనుల నిర్వహణకు ఆటంకం కలగకుండా ఉండేందుకు 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.2 లక్షల విలువైన జనరేటర్‌ను సరఫరా చేసింది. అయితే దాని నిర్వహణ, డీజిల్, ఇతర ఖర్చులపై అధికారులకు స్పష్టత లేకపోవడంతో అప్పటి నుంచి కార్యాలయం వెనుక భాగంలో వృథాగా పడవేశారు. జనరేటర్‌ను ఏళ్ల తరబడి ఉపయోగించకపోవడంతో అందులోని విలువైన సామగ్రి తుప్పుపట్టి పోతోంది. అధికారులు స్పందించి జరరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినట్లయితే వీడియో కాన్ఫరెన్స్‌లతోపాటు ధ్రువపత్రాల మంజూరుకు ఆటంకం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.

